

# రేషాషాహీయం

కాలి హిరణ్మయీదేవి

**"ఛఛ- కాషాయం గుడ్డలు కొనుక్కుని సన్యాసుల్లో కల్పినంత ఉత్తమం లేదు" ఎప్పట్లాగే విసుక్కున్నాడు. మాధవరావ్.**

'అక్కడికి ఆ కాషాయం గుడ్డలేవో చవగ్గా దొరుకుతున్నట్లు' అంది అతని అంతరాత్మ.

చేసేది ప్రైవేట్‌పరం ఉద్యోగం- మధ్యతరగతి జీవితం- వచ్చే ఆ చిన్నపాటి సంపాదనలో అన్ని ఖర్చులు ఎదుర్కోలేక- ఆడుక్కుతిని బతకలేక త్రిశంకు స్వర్గంలో ఇరుక్కున్న ఈ సగటు మానవుడాయె.

అతనిచేత సన్యాసం తీసుకునే భారం కలిగించిన పుత్రరత్నం రవితేజ "అదికాదు నాన్నా! ఇప్పటికే రెండ్రోజులైంది బుక్ అయిపోయి- రేపు హోంవర్క్ చేసి చూపించకపోతే క్లాస్‌నుండి వెళ్లగొడతాడు మా సార్" అన్నాడు తన అవసరం ఎంత గట్టిదో నొక్కి వక్కాణిస్తూ..

అంతకు ముందే రాధ వచ్చి ఖరాఖండిగా చెప్పింది 'ఉల్లిపాయలు, కిరోసిన్' తీసుకురమ్మని, అసలే అవి అరువు పుట్టని అపురూపవస్తువుల జాబితాలోవి కాబట్టి.

ఇంతలో 'నాన్నా! నాన్నా' అంటూ పరుగున వచ్చింది సిరితేజ.

"ఏం తల్లీ! నీకేం కావాలి?" దాచినా దాగని విసుగుతో అడిగాడు.

"ఆ ... మరే... అసలు ముందే నా స్కర్ట్ కొంచెం చిరిగి ఉంది. దాన్ని మా ఫ్రెండ్ పట్టుకుని లాగేసరికి పెద్దగా చిరిగింది- అయినా ఈ సారి కొత్త యూనిఫాం కొంటానని కొనలేదు"... నేరం నాదికాదు మీదే' అన్నట్టుగా అంటోన్న సిరితేజని విసురుగా లాగింది అపుడే వచ్చిన రాధ.

"మీకేం తల్లీ అన్ని నాశనం చేసుకుని వస్తారు. నేనేదన్నా చెప్పబోతే మీ నాన్నగారేమో ఒంటికాలిన లేస్తారు. ఇదుగో జాకెట్లు చిరుగుతూ ఉంటే కుట్లేసుకుంటున్నాను. నాలుగు జాకెట్ ముక్కలు తెమ్మంటేనే ఇంతవరకు తేలేదు" అంది.

'ఛ..ఛ' అంటూ మాధవ్‌రావ్ అనగానే "సన్యాసుల్లో కలిసిపోతానంతే- అని మీరనక్కర్లేదు. పన్లోపని నాకో ఆరెంజ్ కలర్ నైటీ తెండి. అదేసుకుని మీ అడుగుజాడల్లో వచ్చేస్తాను" అంది రాధ.

అదేదో పిక్నిక్ ప్రోగ్రాం అనుకున్నట్టున్నారు పిల్లలూ ఏక కంఠంతో- "నాన్నా- నాన్నా మేమూ వస్తాం నాన్నా" అన్నారు.

తలపట్టుక్కూర్చున్నాడు మాధవరావ్.

ఇంతలో వాకింగ్‌కి వెళ్లిన రంగనాథం తిరిగొచ్చాడు దగ్గుతూ తండ్రిని చూడగానే 'సాయంత్రం కాఫ్ సిరప్ తెస్తానని ప్రామిస్' చేసింది గుర్తొచ్చింది మాధవరావుకి.

"ఏరా ఆఫీస్‌నుండి ఇపుడేనా రావడం?" అన్నాడు రంగనాథం. ఆయనలా అడిగినా 'మందు తీసుకురాకుండానా రావడం?' అన్నట్టుగా అనిపించింది.

"ఊ..' అని నసుగుతూ, పేపర్ మొహానికి అడ్డు పెట్టుకున్నాడు మాధవ్.

నీరసంగా దిగులుగా కూర్చున్న మాధవరావ్‌ని చూడగానే ఎక్కడ్లేని జాలి ముంచుకొచ్చింది రాధకి

"మొన్న మా అన్నయ్యొచ్చినపుడు చీరకొనుక్కోమ్మా అంటూ నాల్గొందలు ఇచ్చి వెళ్లాడు- ఇన్ని ఖర్చులుండగా చీర ఎందుకులెండి . వాటితో ఇపుడు బండి నడిపించండి" అంటూ లోపలికెళ్లి డబ్బు తెచ్చి మాధవరావ్ చేతిలో పెట్టింది.

దాంతో మాధవరావ్ మొహంలో కాస్త కళ వచ్చి చేరింది. భార్య చేతుల్ని ఆప్యాయంగా నిమిరి, ఉత్సాహంగా సైకిల్ బైటకు తీశాడు.

ooo

బుక్ చేతికందడంతో 'హోంవర్క్' చేసుకోడంలో మునిగిపోయాడు రవితేజ.

కొత్త స్కర్ట్‌గుడ్డ పట్టుకుని టైలర్ దగ్గరికెళ్లింది సిరతేజ.

పురాణకాలక్షేపానికి వెళ్లిన తండ్రి అట్నుండి అటే ఆదే ఊళ్లో ఉన్న కూతురింటికెళ్లాడు.

మాధవరావ్ తెచ్చిన వెచ్చాలు, కూరగాయలు, ఇంట్లోపెట్టి కాళ్లు కడుక్కోడానికి బాత్‌రూమ్‌దగ్గరకు వెళ్లాడు.

సాయంత్రపు స్నానం ముగించుకుని వస్తున్న రాధ ఆదరాబాదరాగా చుట్టుకున్న చీరలో విరిసీ విరియని పువులా కనిపించింది. తనని సమీపించబోతున్న మాధవరావ్ వంక చిరుకోపంగా చూస్తూ "స్నానం చేసెయ్యండి- తొందరగా మనింటి ఓనర్ దయతల్చి నీళ్లొదిలాడు- మళ్లీ అన్నీ నింపి పట్టుకోవచ్చు" అంది.

'హు' అనుకుంటూ - అపనిలో నిమగ్నమయ్యాడు.

చిన్న నల్లటిపూలున్న తెల్లని వాయిల్ చీర కట్టుకుని, నల్ల జాకెట్ వేసుకుని జడ వేసుకుంటున్న రాధవంక తదేకంగా చూస్తూ నిలుచుండిపోయాడు మాధవరావ్- అద్దంలోనుండి కనిపిస్తోన్న అతని వంక చూస్తూ "ఏంటా చూపు"

అంటూ మురిపెంగా గసిరింది.

ఆ గొంతులోని మార్దవాన్నిట్టే పసిగట్టిన అతను మురిపెంగా లేత తమలపాకులా నిగనిగలాడుతున్న కడుపుమీద ముద్దు పెట్టాడు.

"ఏయ్" అంది కితకితలతో కిలకిలా నవ్వుతూ.

వేసుకున్నది నల్లటి జాకెట్టేమో పచ్చటి పసిమిఛాయ మరింత కొట్టొచ్చినట్టు తెలుస్తోంది- ఆమె వంటిరంగు ఎపుడూ అతనికి వింతపరవశాన్ని కలుగ చేస్తుంది.

'ఈ నల్లటివాడిని చేసుకోడానికి ఆ పిల్ల ఒప్పుకుంటుందో, లేదో అని పెళ్లి చూపుల కెళ్లొచ్చిందగ్గర్నుండి వారం రోజులు దిగులు పడ్డది' గుర్తుకు వచ్చినపుడల్లా- అతనికి పెళ్లైన తొలిరోజులు గుర్తుకొస్తాయ్. రవిగాంచని అందాలివి, అంటూ ఆమె పసిమిశరీరాన్ని పదేపదే తడమటం ఆమెకి మురిపాన్ని అంతకు మించిన గర్వాన్ని కలిగించే మధురస్మృతి.

"నీకోసం ఏం తెచ్చానో చూడు" అంటూ పొట్లాం అందించాడు.

"ఓయ్ సన్నజాజులు, మల్లెలు" అంది ఆనందంగా.

అమె అల్పసంతోషం- సంతోషంతోపాటు- గిల్టీ ఫీలింగ్‌ని కలిగచేసింది మాధవరావుకి. అంతలోనే తేరుకుని "తొందరగా మాలకట్టవోయ్- రాత్రికల్లా విచ్చుకుంటాయ్"

"ఆ... ఆ.. మీ కోరికల్లా" అంది కవ్విస్తున్నట్టు.

"అక్కడికి నీలో కోర్కెలేవీ లేనట్టు" అన్నాడు ఉడుక్కుంటూ.

"శ్రుతి చేశాక వీణ పలక్కుండా ఉంటుందేంటమ్మా" అంది గోముగా. ఆమెకి ఒక విషయం ఎపుడూ ఆశ్చర్యాన్ని కలగచేస్తూంటుంది. భర్త ఊరికెళ్లినా చెయ్యేయకపోయినా శరీరంలో ఏమార్పూ రాదు. అదే అతని చేతి వేలికొసలు తాకితే చాలు నరాలు జివ్వుమంటాయ్. నిద్రాణమయిన కోరికలు పడగలు విప్పుతాయ్.

"ఈ ఆర్థికబాధలతో నీ కోరికలని అణచేస్తున్నాను కదూ" అన్నాడు.

"కోరికల సంగతేమో నన్నణచేస్తుంటారుగా" అంది కొంటెగా.

"ఈ బాధలే లేకుంటే నా అసలు సత్తా తెలిసేది" అన్నాడు.

"అదేం కాదు. ఈ బాధలవల్లే అందులోని సుఖం ఏంటో తెలుస్తోంది."

"ఏం సుఖమో! పెరిగే ఖర్చులను తల్చుకుంటే..."

"వద్దొద్దు తలుచుకోకండి. సన్యాసుల్లో కలుస్తానో అంటూ రంకెలు వేస్తారు".

"నీకవి రంకెల్లా వినిపిస్తున్నాయా? చూస్తాండు నిజంగానే కలుస్తాను అపుడుగానీ తెలిసిరాదు".

"సర్లెండి ఇవన్నీ కాస్త సంజ వాలేసరికి గూటికి చేరిపోతాయి" అంది నవ్వుతూ.

"నీలాంటి అందాలబొమ్మ ఉంటే ఏ సన్నాసి, సన్యాసుల్లో కలుస్తాడు" అన్నాడు తనూ శ్రుతి కలుపుతూ.


"ఇక పిల్లలొస్తారు- ఉతికిన పైజామాలాల్చి అక్కడ పెట్టాను- ఆ టవల్ మార్చండి" అంది పూలల్లడానికి ఉపక్రమిస్తూ..

టీ.వీ. చూస్తూ చకచకా పూలల్లుతున్న ఆమె వేళ్లను చూస్తూ ఆశ్చర్యపోతున్న మాధవరావ్‌తో...

"అందరూ టీ.వీ. ప్రోగ్రాంల గురించి మాట్లాడుకుంటుంటే మనింట్లో అది లేక వాళ్లతో మాట కలపలేకపోయేదాన్ని. ఎలాగో ఇది కొన్నాం- ఇపుడేమో అంతా ఈటీవి, జీటీవి అంటూ రకరకాల ఛానెల్స్ ప్రసారాల గురించి మాట్లాడుకుంటూంటే బిక్కమొహం వేయాల్సి వస్తోంది. మనమూ ఆ కనెక్షన్ తీసుకుంటే..." అని రాధ అంటూండగానే..

"ఏం బాగుండదు. ఈ కనెక్షన్లు మనుషులమధ్య ఉన్న కనెక్షన్లని దారుణంగా చంపేస్తున్నాయ్. ఏ ఇంటికి వెళ్లినా ఓ కన్ను టీ.వీ. మీద ఉంచి మాట్లాడే వాళ్లే. అంతెందుకు రాత్రల్లా ఆ ప్రోగ్రామ్స్ చూసి, రోజంతా నిద్రమొహాల్తో ఉండే మా కోలీగ్స్‌ని చూసినపుడల్లా టీ.వీ. అంటేనే రోతపుడుతుంది" అన్నాడు మొహాన్ని అసహ్యంగా పెట్టి.

"సర్లెండి పొద్దస్తమానం పనిచేసిన నాకు కాస్త రిలాక్సింగ్‌గా ఉండాలని ఉండదేంటి? ఖర్చులో




ఖర్చు ఇంకో వంద - నాకోసం" అంది కినుకగా రాధ.

హూ.. నెలకి అదనంగా మరో వంద ఖర్చు. వద్దంటే ఇక పదిరోజులు మొహం వేళ్లాడేసుకుని మాటామంతీ లేకుండా ఉంటుంది. తనపరంగా ఆలోచిస్తే తనకీ కాస్త రిలాక్సింగ్‌గానే ఉంటుంది. ఆమె కోరుకున్నది చిన్నదే కదా' అనుకుని- "ఓ.కే. డియర్- రేపెళ్లి మాట్లాడతాలే" అన్నాడామెని వాటేసుకుంటూ.

"భోజనాలు కానివ్వనీయండి. కొత్త పెళ్లికొడుకులా ఇదేంటి" అంటూ వంటింట్లోకి దారితీసింది.

భోజనాలయ్యాయి. సింక్ దగ్గర అంట్లు కడుగుతోన్న రాధని సమీపించి-

"అతికష్టంమీద మన పిల్లరాక్షసుల్ని నిద్రబుచ్చాను. ఇక రారాదూ.." బుగ్గమీద రాస్తూ అన్నాడు.

"సరసాలు చాలు శ్రీవారూ వేళకాదు-" అని ఆమె 'హం' చేస్తే-

"విరహాలగోలా వంటింట్లో...ఊహు -హూ" అంటూ ఆమెనలాగే మంచంవరకూ పాదవిపట్టుకుని నడిపించాడతను. కాసేపటికి రాధ మొహంలో అలసట, ఆ కళ్లలో తృప్తి - మాధవరావ్ కెంతో ఆనందాన్ని కలిగించింది.

"పైసా ఖర్చులేకుండా ఆనందం ఇచ్చేది ఇదొక్కటే" అన్నాడామె నుదుటిని చుంబిస్తూ, కాస్త బాధగా.

"ఎందుకండి అలా బాధపడ్తారు. మంచిరోజులు రాకుండా పోవులెండి" అంది చిరుచెమటతో తడిసిన అతని ముంగురుల్ని సవరిస్తూ.

"నిజమే ఈ నెలనుండి రెండొందలు జీతం పెంచుతున్నారు- కాబట్టి కాస్త హాపీనే" అన్నాడు మాధవరావ్.

ooo

తెల్లవారింది కిచెన్‌లో హడావుడిగా ఉన్న రాధకి, ఇంటి ఓనరొచ్చి ఆ నెలనుండి అద్దె రెండు వందలు పెంచమని అడగడం- మాధవరావ్ వాదించి వాదించి ఆఖరికి నూటయాభైకి ఒప్పించి పంపడం వినిపిస్తూనే ఉంది.

"హూ ఇలా జీతం పెరగడం ఆలస్యం- ఈ ఖర్చులంతకన్నా వేగంగా పెరుగుతాయ్" అనుకుంది విరక్తిగా.

"ఛ..ఛ.. ఏం ఖర్చులో- సన్యాసుల్లో కలిసినంత ఉత్తమం ఇంకోటి లేదు" అంటూ వస్తోన్న మాధవరావ్ వంక అలా చూస్తూండిపోయింది రాధ.

■